పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే



రవీంద్రభారతి పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

మాదాపూర్: చిన్ననాటి నుంచే విద్యతో పాటు విలువలను నేర్చుకోవాలని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపల్ హైమ తెలిపారు. మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తాతలు, అవ్వలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి క్రమశిక్షణ అవసరమన్నారు.పెద్దల అనుభవాలు, సూచనలు, సలహాలు దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.

నిమజ్జనాలు ప్రారంభం

రాయదుర్గం: గణనాథుల నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. మల్కంచెరువు వద్ద నిర్మించిన కోనేరులో సోమవారం పలు విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెద్ద విగ్రహాలను క్రేన్ ద్వారా నిమజ్జనం చేస్తుండగా చిన్నవాటిని కొలనులో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ, పోలీసులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చెరువులు కళకళ..



కొత్తకుంట చెరువు



కాయిదమ్మకుంట కోనేరు

చందానగర్: వినాయక చవితి పండగను పురస్కరించుకొని చందానగర్ సర్కిల్- 21 పరిధిలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరులను శుభ్రం చేస్తున్నారు. సర్కిల్ 21 పరిధిలో 6 నిమజ్జనం పాయింట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 3 కోనేరులు, రెండు చెరువులు, ఒక బేబీపాండ్‌ను జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

నిమజ్జన ప్రాంతాలివే..

చందానగర్ సర్కిల్ -21 పరిధిలో చందానగర్ గంగారం పెద్ద చెరువు, హఫీజ్‌పేట్‌లోని కాయిదమ్మకుంట చెరువు, దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట, మియాపూర్ గురునాథం చెరువుల వద్ద కోనేరులు, కొత్తకుంట చెరువులలో కేవలం మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనం, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో తాత్కాలికంగా చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా బేబి పాండ్ ఏర్పాటు చేస్తున్నారు.

- చందానగర్ సర్కిల్ పరిధిలోని కోనేరుల వద్ద కనీస వసతులు, నిమజ్జన ఏర్పాట్లు కొరకు రూ.42 లక్షలు
- వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరులలో బోర్ల ద్వారా, ట్యాంకర్ల ద్వారా మంజీరా నీటితో నింపుతున్నారు.
- పెద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గంగారం చెరువు వద్ద రెండు, కాయిదమ్మకుంట వద్ద రెండు, కొత్తకుంట వద్ద ఒకటి, గురునాథం చెరువు వద్ద ఒక్క క్రేన్‌ను ఉంచనున్నారు.
- కోనేరుల వద్ద విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.
- భక్తుల కోసం గంగారం కోనేరు వద్ద ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు.
- జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సూపరింటెండెంట్‌లతో ఎప్పటికప్పుడు నిమజ్జనాన్ని పర్యవేక్షించడానికి టీంలను ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కోనేరు వద్ద చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక వాహనాలలో డంప్‌యార్డుకు తరలింపు
- పోలీసులతో ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ఎస్ఐ, ఏఎస్ఐ స్థాయి అధికారులతో కట్టుదిట్టమైన భద్రత
- ఈ నెల 7వ తేదీ నుంచి నిమజ్జనాలు ప్రారంభమై 17న ముగుస్తాయి.



గంగారం పెద్ద చెరువు వద్ద భారీ క్రేన్

వసతులు ఏర్పాటు



చందానగర్ సర్కిల్ పరిధిలో 6 నిమజ్జనం పాయింట్లు ఉన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కోనేరుల వద్ద వసతులు, భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 24 గంటల పాటు జీహెచ్ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంటారు.

-మోహన్‌రెడ్డి, ఉప కమిషనర్, సర్కిల్ 21 చందానగర్

కట్టుదిట్టమైన భద్రత



కాలనీలలో ఏర్పాటు చేసే గణనాథుడి సమాచారం తప్పనిసరిగా పోలీసులకు అందించాలి. ప్రతి మండపానికి జియో ట్యాగింగ్ చేస్తున్నాం.చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారం చెరువు, పీజేఆర్ స్టేడియం, నల్లగండ్ల, గోపినగర్ చెరువుల నిమజ్జనం పాయింట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు భద్రత ఏర్పాటు చేస్తున్నాం. - పాలవెల్లి, ఎస్‌హెచ్‌ఓ, చందానగర్ పోలీస్‌స్టేషన్



గంగారం పెద్ద చెరువు వద్ద మొబైల్ టాయిలెట్స్

ప్రజావాణి .. 9 వినతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు అందజేశారు. పింఛన్లకు 6, టౌన్ ప్లానింగ్‌కు 4 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ రమేష్, టీపీఎస్ రవీందర్ పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో..

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 వినతి పత్రాలు అందగా 2 రెవెన్యూ, 3 టౌన్‌ప్లానింగ్‌కు విభాగానికి రావడంతో సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించవచ్చు



ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని ప్రారంభించిన నటి లహరి

మాదాపూర్: మారుతున్న జీవనశైలి, ఒత్తిడి ఇతరత్రా కారణాల వల్ల మహిళలు పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని స్పోర్ట్స్, ఫిట్‌నెస్ కన్సల్టెంట్ దీప్తి అక్కి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని సోమవారం టీవీ నటి లహరితో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించి సరైన చికిత్స అందించవచ్చని తెలిపారు. ప్రతి 87 మంది మహిళల్లో ఒక్కరు అండాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అవకాశం ఉందన్నారు. డాక్టర్ ప్రవీణ్ అడుసుమిల్లి, మెడికవర్ హాస్పిటల్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మహేశ్ పాల్గొన్నారు.

సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా..

'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ లీడర్స్' కోర్సు ప్రారంభం

రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' ఆధారిత సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా ఐఐఎం కలకత్తా, గచ్చిబౌలిలోని టాలెంట్‌స్ప్రింట్ సంయుక్తంగా కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టారు. 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ లీడర్స్' పేరిట ఈ కొత్త కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం కలకత్తా డైరెక్టర్ సాయిబల్ ఛటోపాధ్యాయ, మార్కెటింగ్ గ్రూప్‌నకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ శరవణ జైకుమార్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌కు చెందిన ప్రొఫెసర్ దేబాషిస్‌సాహు, టాలెంట్‌స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనుపాల్ పాల్గొన్నారు.

సరస్వతీ విద్యామందిర్‌లో 'మీ అభివృద్ధి- దేశాభివృద్ధిపై శిక్షణ'



మీ అభివృద్ధి-దేశాభివృద్ధిపై జరిగిన కార్యక్రమం

చందానగర్: చందానగర్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఐ లీడ్ ఇండియా మిషన్- 2047 విశ్వగురు భారత్' కొరకు మీ అభివృద్ధి- దేశాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సహజంగా ఉండే భయం, సిగ్గు వదిలిపెట్టి ఎందుకు, ఏమిటి, ఎలా అని విషయ జ్ఞానాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో 7వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ఫౌండర్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రొఫెసర్ సుదర్శన్ ఆచార్య, శ్రీనివాస్ ఆచారి, పత్యం శ్రీనివాస్, నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ, అఖిల కన్‌స్ట్రక్షన్స్ నర్సింహారెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు పాపారావు, నరేంద్ర ప్రసాద్, రామచంద్రారెడ్డి, రఘునందన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకన్ అండ్ డ్రైవ్.. 11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 11 మందికి రూ. 2 వేల చొప్పున జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 11 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే..

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

మాదాపూర్: భారతదేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని మన దేశాన్ని ప్రపంచపటంలో ముందుంచాల్సిన బాధ్యత వారిదేనని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌తో పాటు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలన్నారు. విద్యతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఉన్నత విద్య చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అవినాష్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బ్రహ్మదేవర అవినాష్, అకడమిక్ డీన్ డాక్టర్ సుశీల కందూరి, డాక్టర్ నీతు, డాక్టర్ సావిత్రీదేవి, లహరి సాగి,మణిమాల పాల్గొన్నారు.

టీహబ్‌లో 'ల్యాబ్ టు మార్కెట్ '



ఏఐసీటీ హబ్ కార్యక్రమంలో పాల్గొన్న స్టార్టప్ ప్రతినిధులు

రాయదుర్గం: అటల్ ఇంకుబేషన్ సెంటర్ (ఏఐసీ) టీహబ్ ద్వారా 'ల్యాబ్ టు మార్కెట్' ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రకటించింది. నూతన ఆవిష్కరణలను వేగవంతం చేయడమే ఈ ల్యాబ్ టు మార్కెట్ ప్రోగ్రామ్ లక్ష్యమని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. టీహబ్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిక చేసిన 23 స్టార్టప్‌లు .. ఏఐసీటీ హబ్ ద్వారా 'ల్యాబ్ టు మార్కెట్' ప్రోగ్రామ్ కోసం 200 మంది స్టార్టప్‌ల ప్రతినిధులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో అత్యుత్తమమైనవిగా గుర్తించిన 23 స్టార్టప్‌లు ఎంపిక చేయబడ్డాయి. డీ కల్చర్ సొల్యూషన్స్, ఏఎస్ఎంఐ ఇన్నోవేషన్స్, భారత్ ప్లాస్టిపే, ది హైడ్రోజన్ ఎకోసిస్టమ్, ఏబీఈ బైక్స్, స్మార్ట్‌కోష్, గ్లాస్‌మార్ట్, విస్ హెల్త్, రిథమ్ఎక్స్, కార్డియాక్ రీహబ్, ట్రాన్స్‌స్క్రిప్ట్ లైఫ్ సైన్సెస్, నియోసర్జిక్స్, టోకెన్-డిస్క్, రోబిక్‌రుఫామ్, భావుమ్యా, టీజూన్, జెన్‌ట్రిక్స్, అచింట్యా ప్రొడక్ట్స్, ఫామ్‌న్యూట్రా/బ్లిస్‌బాడీ, ర్యాప్పురస్‌మైండ్, ఎమియంట్ అండ్ ఓహెనెర్జి ట్రీటెక్ సొల్యూషన్స్ వంటివి ఉన్నాయి.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేత

మియాపూర్: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 111 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే గాంధీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 కోటి 11లక్షల 12 వేల 876 రూపాయలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్ గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, అన్వర్ షరీఫ్, గంగాధర్, ప్రసాద్, చంద్రిక ప్రసాద్‌గౌడ్, సుప్రజ తదితరులు ఉన్నారు.

నల్లగండ్ల మార్కెట్ అభివృద్ధికి కృషి

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పించాలంటూ మార్కెట్ కమిటీ ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ మార్కెట్‌లో షెడ్లను అభివృద్ధి చేయడంతో పాటు ప్రహరీకి మరమ్మతులు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు డి.వీరేశంగౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఖాజా, కోశాధికారి శ్రీనివాస్, ప్రతినిధులు పాండు, మొయిజ్, సల్మాన్, సాయి, మల్లేష్, లాల, చిన్నా పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

గచ్చిబౌలి: బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన దేవరపాగ పద్మ భర్త చనిపోవడంతో బతుకుదెరువు కోసం మసీద్‌బండకు వలస వచ్చింది. పద్మ కూతురు(17) పటాన్‌చెరులోని ఎల్లంకి కాలేజీలో పాలిటెక్నిక్ కోర్సు చదువుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు తల్లి ఇళ్లలో పని చేసేందుకు బయటకు వెళ్లింది. తిరిగి 7 గంటలకు వచ్చే సరికి బాలిక సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొంది. కామెర్లు రావడంతో కొద్ది రోజులుగా ఇంట్లో ఉంటోంది. రెండు రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుందని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలురు అదృశ్యం

చందానగర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలురు అదృశ్యమయ్యారు. చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కిష్టయ్య తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రమేష్ కుటుంబం ఫుట్‌పాత్‌పై ఉంటున్నారు. అతని కుమారుడు అరుణ్ (2) సోమవారం ఉదయం ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. ఈ మేరకు బాలుడి తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో..

చందానగర్ హుడా కాలనీలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం .. సంకల్ప ఫౌండేషన్‌లో ఉండే లక్ష్మీవరప్రసాద్ (11) సోమవారం ఉదయం ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. బాలుడి ఆచూకీ కోసం ఫౌండేషన్ సభ్యులు గాలించినా లభించలేదు. దీంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు.

లంబోదరుడికి అర్చనలు, అభిషేకాలు, హోమాలు

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు సోమవారం వినాయకుడికి అర్చనలు, అభిషేకాలు, హోమాలు చేశారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో కొలువుదీరిన గణనాథుని పూజల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలోని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



నానక్‌రాంగూడలో లోధా బస్తీలో ..



గౌతమీనగర్ కాలనీలో..



నానక్‌రాంగూడలో ..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



ఖాజాగూడలోని కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఇజ్జత్‌నగర్ విండ్ మిల్స్ అపార్ట్‌మెంట్‌లో..



చందానగర్ వేమన కాలనీలో ..



కొండాపూర్ ఉదయ్‌సాత్ అపార్ట్‌మెంట్‌లో..



శ్రీజ బృందావనం రెడ్డీస్ కాలనీలో..





ఓల్డ్ హఫీజ్‌పేటలో .. ఎమ్మెల్యే గాంధీ, ఉత్సవ కమిటీ సభ్యులు



మియాపూర్ ఎంజీ ఎర్త్ మూవర్స్ ఆధ్వర్యంలో..





హైటెక్ సిటీ కోహినూర్ ప్రాజెక్ట్‌లో.. వేడుకల్లో హోప్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు, కోహినూర్ ఫెస్టివల్ కమిటీ సభ్యులు

ఈఎస్ఐ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెల జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రాపురంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెల జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించాలని కోరారు. వారికి చట్టపరంగా రావాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు రాజయ్య, యాదయ్య, సురేష్, సిద్ధు, సంతోష్ కుమార్‌లు పాల్గొన్నారు.

కాళోజి రచనలు, సేవలు మరువలేనివి

రాయదుర్గం: ప్రజాకవి కాళోజీ జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం ఎంతో విలువైనవని హెచ్‌సీయూ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస కోసం 'నా గొడవ' ద్వారా తన జీవితాంతం పరితపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు త్రివేణి, డి విజయలక్ష్మి, డాక్టర్ భూక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత రమేష్‌నాయక్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో..

గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో సంస్కృత ఉపాధ్యాయుడు డాక్టర్ లంక పార్థసారధి ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి మురళి మాట్లాడుతూ కాళోజి రచనలు, తెలుగు భాషకు చేసిన సేవలు మరువరానివన్నారు.